



























ప్రజలకు వరికూటి నూతన సంవత్సర శుభాకాంక్షలు



వేమూరు: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అమర్తలూరు మండల కూచిపూడి గ్రామంలోని తన స్వగృహంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు, గృహ సారథులు, సోషల్ మీడియా ప్రతినిధులు నూతన సంవత్సర వేడుకలకు హాజరు కావాలని తెలిపారు.

కడప దర్గా బాబా శిష్య బృందం రక్తదానం



రక్తదానం చేస్తున్న కడప దర్గా బాబా శిష్య బృందం

రేపల్లె రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య అన్నారు. కడప దర్గా పదవ పీఠాధిపతి హజ్రత్ కాజా సయ్యద్ ఈసుల్లా అమీనుల్లా జన్మదినం సందర్భంగా పట్టణానికి చెందిన ఆయన శిష్య బృందం 25 మంది స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వీరరాఘవయ్య మాట్లాడుతూ అపోహలు వీడి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. బాబా శిష్య బృందం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ఇటువంటి సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు కొలసాని పృథ్వి గణేష్, శిష్య బృందం మగ్దుం బాష, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు

రేపల్లె రూరల్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం కృషి చేస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లోనూ.. ముందుంచేందుకు ఎస్‌ఎఫ్‌ఐ బృంద సభ్యులు కృషి చేస్తారని చెప్పారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ లక్ష్మణరావు, సూర్యప్రకాశ్, నాయకులు హమనాగశ్రీ, భవానీ పాల్గొన్నారు.

బండ్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకున్న చందోలు బండ్లమ్మ

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, బండ్లమ్మ దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా దుర్గా మాతకు పూజలు



దుర్గా మాతకు పూజలు నిర్వహించిన భక్తులు

వేమూరు: పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలోని దుర్గా మాత పూజ మహోత్సవం నిర్వహించినట్లు ఫణితపు సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రతి ఏడాది డిసెంబరు 31న దుర్గా మాత గ్రామ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'బాల బాట' కార్యకర్తల సమావేశం

వేమూరు: విద్య ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని కార్డు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం బాల బాట అభివృద్ధి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాల బాట స్థాపించి, ఉచిత విద్యను అందించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలు ఆయా గ్రామాల్లో విద్యార్థులతో గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలు రాయించి, ప్రవేశం పొందేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యకర్తలకు నూతన వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. బాలబాట డీఓలు పి.రాహుల్, శాంతి, కె.సుబ్బారావు, బాజి పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

ప్యాపర్రు(వేమూరు): షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి.. పూరిల్లు దగ్ధమైంది. తహసీల్దారు మోహర్ వివరాలు వెల్లడించారు. అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో గుమ్మడి పాల్‌రాజు ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు తెనాలి అగ్నిమాపక కేంద్రం అధికారులకు సమాచారం అందజేశారు. సిబ్బంది మంటలను అదుపు చేశారు. రెవెన్యూ అధికారులు నష్టం అంచనా వేశారు. బాధితులకు రెవెన్యూ అధికారులు బియ్యం అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ

రేపల్లె రూరల్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పేటేరు సచివాలయం పరిధిలో పారిశుద్ధ్య సిబ్బందికి ఆదివారం వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్ స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆదేశాల మేరకు స్వీట్లు అందజేసినట్లు తెలిపారు.

ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా పీవీపాలెం ఉపాధ్యాయులు



పిట్టలవానిపాలెం: మండలానికి చెందిన ఉపాధ్యాయులు బుద్దా నాగాంజనేయులు, జంపాని శ్రీనివాసరావు ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష కార్యదర్శులు పరిశ నరసింహారెడ్డి, ఎల్.చక్రపాణి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.











డప్పు కళాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలిటౌన్: కొలకలూరులోని శుక్రవారం రాత్రి మృతి చెందిన డప్పు కళాకారుడు బీసీపోగు రవిబాబు కుటుంబాన్ని ఆదివారం తెనాలి కళల కాణాచి సభ్యులు పరామర్శించారు. ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సంయుక్త కార్యదర్శి కొండమూడి రమేష్ రవిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్ ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేసినట్లు వారు తెలిపారు. సీనియర్ కళాకారుడు సుద్దపల్లి శరత్‌వెంకయ్య, ఏబీఎం చర్చి పాస్టర్ ఎస్.సురేష్ ఉన్నారు.

నాటి వినోదం..పౌరాణిక నాటకం



సత్యహరిశ్చంద్ర నాటకంలోని ఓ సన్నివేశం



నాటకాలను తిలకిస్తున్న కళాభిమానులు

భట్టిప్రోలు: నాటకాలకు ఆదరణ తగ్గుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతంలో అటువైపు దృష్టి మళ్లించేందుకు.. పౌరాణిక నాటకాలను ప్రదర్శింపజేసి కళాభిమానులను కట్టిపడేస్తున్నారు. మండలంలోని ఓలేరు మాజీ సర్పంచ్, ప్రముఖ రంగస్థల కళాకారుడు రవవరపు శ్యామ సుందరరావు వర్ధంతి పురస్కరించుకుని గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానంలోని వార్ సీన్లు ఆద్యంతం ప్రేక్షకులను రంజింపజేశాయి. పౌరాణిక కథల్లోని పాత్రలను నాటకాలల రూపంలో నేటి తరానికి పరిచయం చేయడం సాధారణ విషయం కాదు. గతంలో పల్లె ప్రజలు ఈ నాటకాలను ఎప్పుడు వేస్తారా అని ఎదురు చూసేవారు. నాటి తరం ఈ నాటకాలు, పద్యాలు అన్నా చెవులు కోసుకుంటారు. సినిమాలు, ఇతర మాధ్యమాలు రాకతో పౌరాణిక నాటకాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఆ కాలంలో సమాజంలోని నైతిక విలువలను, మానవ సంబంధాలపై అవగాహన కల్పించేందుకు పౌరాణిక పాత్రలు దోహదపడేవి. నాటి వినోదమైన పౌరాణిక నాటకాలకు ఊపిరి పోసిన శ్యామ సుందరరావు తనయుడు శ్రీనివాసరావును నాటకోత్సవాల నిర్వహణకు ఖర్చును సైతం లెక్క చేయకుండా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా వాహనాన్ని పెట్టి రేపల్లె, వేమూరు పరిసర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ నాటకోత్సవాలను తిలకించేందుకు కళాభిమానులు, కళాకారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఒకటవ హరిశ్చంద్రగా బద్వేలు కిరణ్‌కుమార్, రెండవ హరిశ్చంద్రగా డీవీ సుబ్బారావు, చంద్రమతిగా నెల్లూరు భానుమతి, నక్షత్రకలుగా టీకే, మదిర శాంతయ్య, విశ్వ, వీర, కాల పాత్రలలో ఉప్పు కృష్ణ, సత్యకీర్తి, శిష్యుడిగా దరిసి శ్రీనివాసరావు గుప్త, మాత, కలహగా శాంతిలు ప్రదర్శించిన అభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అతిథులు సాయి దత్త పీఠం ద్వితీయ పీఠాధిపతులు స్వామి రామానంద ప్రభూజీ, ఏపీ మాజీ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ఏపీ నాటక కళా పరిషత్ చైర్మన్ కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, జాతీయ మహిళా కమీషన్ పూర్వ సభ్యురాలు నిర్మాలా వెంకటేష్ నాటక ప్రదర్శనను తిలకించి, అభినందించారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

తెనాలి: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని సంఘ భవనంలో జరిగింది. అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. న్యాయవాది మూల్పూరి లక్ష్మీజగదీశ్వరాంబ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రస్తుత అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా కొలసాని వెంకటకోటయ్య, కార్యదర్శిగా ప్రసాదం పూర్ణచంద్రరావు, సంయుక్త కార్యదర్శిగా పుచ్చకాయల కోటిరెడ్డి, కోశాధికారిగా డాక్టర్ నర్రావుల ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులుగా కొరటాల ఈశ్వర్‌చంద్, బొబ్బా వెంకటేశ్వరరావు, అబ్బూరి రామమూర్తి, మహమ్మద్ అజ్గర్ ఆలీ ఎన్నికయ్యారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం

తెనాలి: మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాల్లో సభ్యులు భాగస్వాములు కావాలని సంస్థ తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ సూచించారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో ఆదివారం మానవత సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డాక్టర్ రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ఈ నెలలో సంస్థ తరఫున చేపట్టిన కార్యక్రమాలను కో–చైర్మన్ డాక్టర్ శారద వివరించారు. కాలేజి అధ్యాపకుల ఉద్యమంలో పనిచేసిన అధ్యాపక ప్రముఖుడు తుమ్మల రంగారావు, 97 ఏళ్ల వయసులోనూ క్రమం తప్పని వ్యాయామం చేస్తున్న జొన్నలగడ్డ నారాయణమూర్తి, బాల సాహితీవేత్త, ఫ్రిలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని, ఆధ్యాత్మిక ప్రవచకురాలు నాగభైరవ గంగా పార్వతిని ఈ సందర్భంగా సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి సందేశంతో ఉన్న మానవత డైరీని డాక్టర్ శారద ఆవిష్కరించారు. కూరపాటి కల్యాణి, టి.శ్రీనివాసబాబు, డీవీ సోమయ్యశాస్త్రి, దుర్గాప్రసాద్, ఓంకార్ ప్రసాద్, ఎస్‌వీ శర్మ, పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో పతకాల పంట



విద్యార్థులతో శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: ఛామ్ ఐటీఎఫ్ నేషనల్ ట్రెడిషినల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తెనాలికి చెందిన కేఎస్కే తైక్వాండో అకాడమి విద్యార్థులు ఏడుగురు బంగారు, ఆరుగురు వెండి, ఎనిమిది మంది కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను రేపల్లెలో శనివారం నిర్వహించినట్లు చెప్పారు. ఆదివారం అకాడమిలో వారికి పతకాలు అందజేశారు. భాస్కరుని శ్రీనివాసరావు, కొత్త రామారావు, కె.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

కనుల పండువగా రాములోరి పట్టాభిషేకం

పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామక్షేత్రంలో 97వ శ్రీ రామ కోటి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ సీతారాముల సామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు క్రోసూరి మురళీ కృష్ణమాచార్యులు నిర్వహణలో హోమం, విష్వక్సేన ఆరాధన, 108 కలశాలతో అభిషేకం, పంచామృతాలతో తిరుమంజన సేవ వైభవంగా నిర్వహించారు. ట్రస్టీలు లీలాసుందరి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో క్షేత్రం గౌరవాధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, దాతలు, అతిథుల్ని సత్కరించారు. అనంతరం శ్రీ రామచంద్రునికి కిరీట ధారణ, పుష్పాభిషేకంతో పాటు పట్టాభిషేక మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అనంతరం భక్తులకు విశేష అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: బోసురోడ్డులోని కాకుమాను శంకరుని సత్రంలో శంకరుని 107వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లోని వందమంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.2 వేల వంతున రూ.2 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. 650 మంది వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. పేదలకు అన్నదానం చేశారు. బాటసారుల సేవ కోసం ధర్మ సత్రాన్ని నెలకొల్పిన ఆధ్యాత్మిక చింతనాపరుడు కాకుమాను శంకరుడు ధన్యజీవి అని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. శంకరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధర్మసత్రం వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు కాకుమాను శరత్‌బాబు, ఈఓ మండెపూడి పానకాలరావు, సిబ్బంది ఎల్.వాసుదేవరెడ్డి, చంద్రం పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్: అయిశెట్టి సీతా రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి స్థానిక నెహ్రూనగర్ 6వ లైనులో సంక్రాంతి సంబరాల్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ అయిశెట్టి శ్రీనివాస్, 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ తెలియజేశారు. ఆ రోజు ఉదయం 5.30గంటలకు శ్రీలక్ష్మీ నారాయణస్వామి అఖండ స్థాపన, నిత్య పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 16వ తేదీ వరకు వివిధ కార్యక్రామాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై తమకు నేరుగా అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

నూతన సంవత్సర సందడి



అమ్మకానికి సిద్ధంగా కేక్‌లు



స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

తెనాలిఅర్బన్: నూతన సంవత్సర సందడి తెనాలిలో నెలకొంది. ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో కేక్ మేళాలు, స్వీట్లు, గ్రీటింగ్ కార్డులు, వివిధ రంగులు, పూల విక్రయ కేంద్రాలను ఆదివారం ఏర్పాటు చేశారు. కేకుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

వృద్ధులు, అనాథలకు దుప్పట్ల పంపిణీ

గుంటూరు మెడికల్: స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి. కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు జీజీహెచ్ సమీపంలో అనాథలకు, వృద్ధులకు క్షవరంతో పాటు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్కోప్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్ని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, రిజిస్ట్రేషన్ శాఖ రిటైర్డ్ ఐజీ యస్. బాలస్వామి, డాక్టర్ చంద్ర, రైల్వే ఎస్ఐ రమేష్, విద్యాశాఖ అధికారి ఖాసిం, గోవిందు, కందుల దీనమణి, రాజు, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

ప్రజలకు ఈవూరి నూతన సంవత్సర శుభాకాంక్షలు



రేపల్లె రూరల్: నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాలు నింపాలని రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈవూరి గణేష్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరం మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్తూ..సుఖసంతోషాలతో ఉండాలని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్త ఆశలతో...

- నూతన సంవత్సరానికి స్వాగతం
- రద్దీగా బేకరీలు, పూల దుకాణాలు
- పట్టణం, గ్రామాల్లో సందడి



చెరుకుపల్లి: న్యూ ఇయర్‌కు బొకేలు, పూలదండలు సిద్ధం

బాపట్ల అర్బన్: కొత్త ఆశలతో.. కొండంత ఆత్మవిశ్వాసంతో నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సమయం ఇది. గతేడాది మిగిల్చి చేదు జ్ఞాపకాలను వదిలేసి, తీపి జ్ఞాపకాలతో వేడుకలను జరుపుకోవడానికి ప్రజలు, అధికారులు, రాజకీయ నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో మిఠాయిలు, పండ్లు, పూల దండలు, బొకేలు భారీగా అమ్ముడయ్యాయి. కొనుగోలుదారులతో పట్టణంలోని దుకాణాలు కిటకిటలాడాయి. ఇక యువత కేకుల కొనుగోలుతో బిజీగా గడిపారు. బేకరీల ఎదుట ప్రత్యేక షెడ్లు వేసి కేకులు విక్రయించారు. ఇక హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. నూతన సంవత్సరానికి కేకులు కట్ చేసి, కేరింతలు, సంబరాల మధ్య స్వాగతం పలికారు.



సిద్ధంగా ఉన్న మిఠాయిలు



చెరుకుపల్లి: కళకళలాడుతున్న మిఠాయి దుకాణాలు

ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- దుష్టచతుష్టయంతో మన పోరాటం
- గుంటూరు వెస్ట్‌లో రికార్డు విజయం ఖాయం
- తొలి బీసీ మహిళగా జగనన్న నన్ను పంపారు
- పార్టీ కార్యకర్తల మద్దతు ఎప్పటికీ మరువలేనిది
- కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని. వేదికపై ఎమ్మెల్యే గిరి, లాలుపురం రాము

పట్నంబజారు: రానున్న ఎన్నికలు ధర్మం, అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని తెలిపారు. కొరిటెపాడు ప్రధాన రహదారిలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయంలో ఆదివారం 37, 38, 42, 43 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. మంత్రితోపాటు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గెలుపు కోసం దత్తపుత్రుడు, దుష్టచతుష్టయాన్ని నమ్ముకుంటే... జగనన్న ప్రజల్ని మాత్రమే నమ్ముకున్నారని తెలిపారు. గుంటూరు వెస్ట్ నియోజకవర్గం చరిత్రలో తొలిసారి ఒక బీసీ మహిళను ఎన్నికల బరిలో జగనన్న నిలిపారని, పార్టీ కార్యకర్తలు, ప్రజలు గెలిపించుకొంటారనే నమ్మకంతో తనను ఇక్కడకు పంపారని స్పష్టం చేశారు. జగనన్న ఆశీస్సులతో పశ్చిమ నియోజకవర్గానికి వచ్చిన తనపై ఇక్కడి కార్యకర్తలు, నాయకులు చూపుతున్న ప్రేమాభిమానాలు ఎంతో సంతోషాన్నిస్తున్నాయని చెప్పారు. పార్టీ గెలుపు కోసం ఎందాకైనా కష్టపడి పనిచేస్తానని తెలిపారు. జగనన్న నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు

వచ్చే ఎన్నికల్లో కష్టపడిపని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా చూసే బాధ్యత తను తాను తీసుకుంటానని మంత్రి రజిని భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరికీ అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏకష్టం వచ్చినా, నష్టం వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలను ప్రభావితం చేసే అంశాల్లో ఓటర్ల జాబితా కూడా ఒకటని తెలిపారు. ప్రతి బూత్ కన్వీనర్ ఓటర్ల జాబితాలో అవకతవకలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. త్వరలోనే డివిజన్ల వారీగా సమావేశాలు, పర్యటనలు నిర్వహిస్తానని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. గుంటూరు వెస్ట్ పరిధిలోని ముఖ్యమైన అభివృద్ధి అంశాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటున్నానన్నారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వైభవంగా ప్రారంభించబోతున్నామని, కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు.

పార్టీ బలంగా ఉంది: ఎమ్మెల్యే మద్దాలి గిరి


పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత బలంగా ఉందని ఎమ్మెల్యే మద్దాళి గిరి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురేయడమే ధ్యేయంగా కలసికట్టుగా అంతా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు లాలుపురం రాము మాట్లాడుతూ పశ్చిమంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం తథ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఆనం సంజీవరెడ్డి, బండ్లమూడి రోజారాణి, బోగీసం శిరీష, ప్రసాద్, చల్లా శేషిరెడ్డి, సతీష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, బత్తుల దేవానంద్, గనికే ఝాన్సీ రాణి, నల్లమేకల రవీంద్ర, ఆయా డివిజన్‌ల సచివాలయ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుని లక్ష దీపోత్సవం



చేబ్రోలులో దీపాల వెలుగులో దర్శనమిస్తున్న మోహన రంగనాథస్వామి

ఖ్యాతి గాంచిన చేబ్రోలులోని మోహన రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాసం సందర్భంగా లక్ష దీపోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. ధనుర్మాసం సందర్భంగా స్థానిక భక్త బృందం ఆలయ ప్రాంగణంలో శంఖు, చక్రం, నామాలు, స్వస్తిక్, ఓం ఆకారాలలో దీపాలను వెలిగించారు. దీపాల వెలుగులో రంగనాథుడు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. – చేబ్రోలు



వైఎస్సార్ సీపీతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి

- కలిసికట్టుగా సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉందాం
- వక్ఫ్‌బోర్డ్ మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ హిమామ్ హుస్సేన్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న హిమామ్‌హుస్సేన్, నాగుర్‌మీరాన్, మౌలాలి, లాల్‌బాషా, తదితరులు

సత్తెనపల్లి: జనహృదయ నేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పిస్తే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంతకు మించిన సముచిత స్థానం ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి కల్పించారని వక్ఫ్‌బోర్డు మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ ఎస్‌కే హిమామ్ హుస్సేన్ స్పష్టం చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షతన జరిగిన ముస్లిం మైనార్టీ నేతల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో ముస్లిం మైనార్టీలకు గౌరవం అందుతుందని, నియామక పదవుల్లోనూ సముచిత స్థానం కల్పిస్తున్నారని, వైఎస్సార్‌సీపీకి మనం అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో ఈద్గా, ప్రహరీ గోడకు నిధులు సమీకరించుకోవటం, రూ.కోట్ల విలువైన స్థలాన్ని మసీదుకు సేకరించుకోవడం జరిగిందన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, సత్తెనపల్లి నియోజకవర్గంలో అంబటి రాంబాబును ఎమ్మెల్యేగా మళ్లీ గెలిపించుకునేందుకు మనమందరం కలిసికట్టుగా వారికి అండగా ఉందామని పిలుపునిచ్చారు. ముందుగా హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాథ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, 5వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ సలీం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ లాల్ బాషా, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు షేక్ ముక్తార్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా పల్నాడు జిల్లా కో కన్వీనర్ షేక్ జానీ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి ఎస్‌ఎం యూనస్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగూల్ బాషా, మైనార్టీ విభాగం నాయకులు హుస్సేన్, షేక్ మహ్మద్ గని, అబ్దుల్ రెహమాన్, సుభాని, ఖలీల్, షేక్ జానీ తదితరులున్నారు.

మంచు దుప్పటిలో పిడుగురాళ్ల



పిడుగురాళ్ల: రోజురోజుకు తీవ్రమవుతున్న చలి పంజా విసురుతుంది. తెల్లవారు జాము నుంచి ఉదయం పది గంటల వరకు ఆదివారం మంచు వర్షంలా కురవటంతో పిడుగురాళ్ల పట్టణమంతా మంచుదుప్పటితో పరిచినట్లుగా కనిపిస్తోంది. రహదారులన్నీ మంచుమయంగా మారిపోయాయి. రాకపోకలకు వాహనదారులు లైట్లు వేసుకొని నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

కరెంటు స్తంభానికి ఢీకొట్టిన కారు

కారెంపూడి: విద్యుత్తు స్తంభాన్ని కారు ఢీ కొనడంతో అది విరిగిపడి త్రుటిలో ప్రాణాపాయం తప్పిన ఘటన స్థానిక శ్రీచక్ర సిమెంట్స్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కారు రోడ్డు మార్జిన్‌లో ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీ కొనడంతో స్తంభం విరిగి కింద పడింది. దీంతో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఆ ప్రాంతంలో కరెంటు నిలిచిపోయింది. ఇదిలా ఉంటే కారులో ఉన్న వారు కారు వదలి వెళ్లిపోయారు. నేలవాలిన తీగలు వినుకొండ వెళ్లే రహదారి మార్గంలో ప్రయాణించే వారితోపాటు కారులో ఉన్న వారిపై పడినా ప్రాణాపాయం సంభవించేది.

రాజుపాలెం ఎస్‌ఐ వీఆర్‌కు బదిలీ

రాజుపాలెం: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ఎం.నారాయణను పల్నాడు జిల్లా ఎస్పీ వీఆర్‌కు ఆదివారం పంపించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని, పనులు సక్రమంగా లేదని వీఆర్‌కు పంపించినట్లు తెలుస్తుంది. సత్తెనపల్లి రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్‌కే సమీరుద్దీన్‌ను ఇన్‌చార్జిగా నియమించగా బాధ్యతలు స్వీకరించారు.

రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ..

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ డిసెంబర్ 31 కావడంతో రాజుపాలెం పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఇద్దరు సిబ్బందికి ఒక్కొక్క గ్రామాన్ని కేటాయించారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నూతన సంవత్సరం వెలుగులు నింపాలి

బాపట్ల: బాపట్ల నియోజకవర్గ ప్రజలకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని కోరారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



బాపట్ల అర్బన్: స్థానిక యానాది కాలనీలోని గిరిజనులను, యానాదులను బాపట్ల జిల్లా ఎస్‌ఎఫ్‌టీ సంఘ సభ్యులు ఆదివారం పరామర్శించారు. రేషన్, ఆధార్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఓటరు గుర్తింపు కార్డు లేని వారిని గుర్తించి వారి సమస్యలను ప్రభుత్వానికి, కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఎఫ్‌టీ కమిటీ అధ్యక్షుడు దేవరకొండ రాము, ప్రధాన కార్యదర్శి ఉయ్యాల శివ, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కె.కామేశ్వరి, సెక్రటరీ పాలపర్తి నాగరాజు, ఉప కోశాధికారి ఉయ్యాల గురవయ్య, దాసరి లక్ష్మి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు సమస్యలకు తక్షణ పరిష్కారం



పట్నంబజారు: నియోజకవర్గంలో సమస్యల్ని పరిష్కరించేందుకు అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని రాజాగారితోటలో ఆదివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ నూరి ఫాతిమా వెళ్లారు. స్థానికుల సమస్యల్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్ని వివరిస్తూ ముందుకు సాగారు. ప్రజల సమస్యల్ని తక్షణ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సైడు కాల్వలు, డ్రైనేజీ మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు జాఫర్ ఖాన్, ఆవుల కోటేశ్వరరావు, జిలాని, నూర్‌అహ్మద్, డీపీ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమానికి కృషి



నగరంపాలెం: విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఏపీ రిటైర్డు పోలీస్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రిటైర్డు ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ అన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని నంది ఇన్విస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, రిటైర్డు ఐజీపీ ఎం.రవిచంద్ర మాట్లాడుతూ త్వరలో సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి, సభ్యులకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, రిటైర్డు ఏఎస్పీ వెల్లంకి లక్ష్మీనారాయణను సత్కరించారు. సమావేశంలో కె.వి.నారాయణ, ఎం.మాణిక్యలరావు, డి.వి.సుబ్బారెడ్డి, ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



పిడుగురాళ్ల: తెలంగాణ నుంచి అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌లోకి తరలిస్తున్న నిషేధిత తెలంగాణ మద్యం బాటిళ్లను పిడుగురాళ్ల పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో తెలంగాణ వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా కారులోని పలు ప్రదేశాల్లో దాచిపెట్టి మద్యాన్ని తరలిస్తున్నారు. పోలీసులు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం సీసాలను తరలిస్తున్న శానం శేషుబాబును అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ.32వేలు ఉంటుందని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, పిడుగురాళ్ల ఎస్‌ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డిలు తెలిపారు. ఈ తనిఖీల్లో పట్టణ ఎస్ఐ కోటయ్య, పఠాన్ రబ్బానీ ఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రెడాయ్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ



క్రెడాయ్ డైరీ ఆవిష్కరిస్తున్న యూనియన్ బ్యాంకు జీఎం రవీంద్రబాబు

పాత గుంటూరు: ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో క్రెడాయ్ గుంటూరు – 2024 నూతన సంవత్సర డైరీని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము అధ్యక్షత వహించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ఎం. రవీంద్రబాబు, డీజీఎం కుందన్ లాల్, ఆర్ఎల్‌పీ హెడ్ డి.కోటేశ్వరరావు, క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, గుంటూరు చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, సెక్రటరీ తియ్యగూర వినోద్‌రెడ్డి పాల్గొన్నారు. జీఎం రవీంద్రబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగానికి రుణాల్ని ఒకటి, రెండు రోజుల్లోనే మంజూరు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని క్రెడాయ్ సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ కొత్తగా వచ్చిన జీవోలు డైరీలో ముద్రించినట్లు తెలిపారు. సతీష్ రెడ్డి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ క్రెడాయ్ సభ్యులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మామిడి రాము మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం మెరుగుపరచడానికి జనవరి 26 ,27, 28 తేదీల్లో ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మెట్టు సాంబశివారెడ్డి, సురేష్, జాయింట్ సెక్రటరీ ఆళ్ల నాగార్జునరెడ్డి, వి.శివనాగేశ్వరరావు, వి.రమాకాంత్, ట్రెజరర్ ఎం.ఎస్.వి. కార్తిక్, ఈసీ మెంబర్స్ వెంకటరెడ్డి, గోనా శివనాగబాబు, వై.పవన్ కుమార్, ఎ. భాస్కర్‌రెడ్డి, మామిడి అరుణ్ సాయి, పొదర్తి సాహిత్, ఎ.భరత్ రెడ్డి పాల్గొన్నారు.

సిరిధాన్యాలను అశ్రద్ధ చేయకండి

డాక్టర్ ఖాదర్‌వలి



గుంటూరు రూరల్: ఆధునిక అలవాట్లకు లోబడి మన సిరిధాన్యాలను అశ్రద్ధ చేయటమే నేటి అనారోగ్యాలకు మూలమని స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిరి ధాన్యాలు రైతు శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలు అవసరాలను పక్కన పెట్టి అనుకరణలకు ప్రాధాన్యత నివ్వడానికి బానిసలైపోయారన్నారు. విపరీతంగా ప్లాస్టిక్ వినియోగం, ప్రాసెసింగ్, జంక్ ఫుడ్ విదేశీ ఆహార అలవాట్లను అలవాటు చేసుకోవడంతో పాటు కృత్రిమమైన సౌందర్య సాధనాలు ఉపయోగించడం, విదేశీ వస్తువులను వినియోగిస్తున్నారన్నారు. చిరు ధాన్యాలు పక్కకు నెట్టి ఆధునిక ఆహార అలవాట్లను అలవరచుకుంటున్నారన్నారు. వీటి ఫలితమే నేడు మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నామని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్ స్టేట్ మెడిసినల్ ప్లాంట్స్ బోర్డ్ సీఈవో చంద్రశేఖరరావు మాట్లాడుతూ గడచిన వందేళ్లలో మారిన జీవన విధానం, ఆహార ఉత్పత్తి పద్ధతి, తీసుకునే ఆహారంలో చోటు చేసుకున్న మార్పులే ఈ విపత్తుకి కారణమని చెప్పారు. ఈ సమస్యకు సిరిధాన్యాలు, కషాయాలే పరిష్కారమని సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంపై రైతునేస్తం ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. నాబార్డు డీడీఎం శరత్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మాధురి, సేంద్రియ రైతులు శివనాగమల్లేశ్వరరావు, శబరినాథ్, తిరుపతిరావు, సూర్యానారాయణ, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పండగలా ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలు

- దుమ్మురేపుతున్న వృషభ రాజాలు
- నేటితో ముగియనున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు



జాతీయ స్థాయి వృషభరాజాల బండలాగుడు ప్రదర్శనలో ఉన్న ఎడ్ల జత



ఎడ్ల జత యజమానిని సత్కరిస్తున్న మేకతోటి దయాసాగర్, నిర్వాహకుడు శ్రీనివాసరావు

పెదకాకాని: జాతీయ స్థాయిలో జరుగుతున్న వృషభరాజాల బండలాగుడు ప్రదర్శనలు పండుగలా కొనసాగుతున్నాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతు సోదరులు, ప్రేక్షకులు చేరుకుని ఎడ్ల పందేలను తిలకిస్తున్నారు. ఒంగోలు జాతి ఎడ్లు బల ప్రదర్శనలో సత్తా చాటుతున్నాయి. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలు ఆదివారం 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎడ్ల పందేల నిర్వాహకుడు, కొప్పురావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావుతో కలసి ఎడ్ల యజమానులను సత్కరించి మెమెంటో అందజేశారు. పశుపోషకులకు అభినందనలు తెలియజేశారు. 5వ రోజు జూనియర్ విభాగంలో 10 జతలు పాల్గొన్నాయి.

నేటితో ముగియనున్న బండ లాగుడు ప్రదర్శనలు..

పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామ శివార్లలో ఈనెల 27న ప్రారంభమైన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలు ఆదివారం 5వ రోజుకు చేరాయి. జూనియర్ విభాగంలో జరిగిన బండలాగుడు ప్రదర్శనల్లో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన డి.రోషన్ బాబు జత 20 నిమిషాల వ్యవధిలో 2812 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, ప్రకాశం జిల్లా, మార్కాపురం మండలం, బోడిచర్ల గ్రామానికి చెందిన తిండి నక్షత్రరెడ్డి ఎడ్ల జత 2,665 అడుగుల దూరంతో ద్వితీయ స్థానంలో, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్ల జత 2,630 అడుగుల దూరంతో తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కేటగిరిలో 9వ స్థానం వరకూ నగదు బహుమతులు, మెమెంటో అందజేశారు. జనవరి 1వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సీనియర్ విభాగంలో 15 జతల ఎడ్లు ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నాయి. సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేయడంతో ఈ ప్రదర్శనలు ముగుస్తాయని నిర్వాహకుడు తోట శ్రీనివాసరావు తెలియజేశారు.

తహసీల్దార్ జాన్‌సైదులు సేవలు అభినందనీయం

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు



తహసీల్దార్ జాన్‌సైదులు దంపతులను సత్కరిస్తున్న జేసీ ఎ.శ్యాంప్రసాద్

శావల్యాపురం: రెవెన్యూ శాఖలో ప్రజల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించిన తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు సేవలు అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు కలిసి ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ శ్యాంప్రసాదు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పదోన్నతులు పొందుతూ 39 సంవత్సరాల పాటు మెరుగైన సేవలు ప్రజలకు అందించటం అభినందనీయమన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు దంపతులను పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల కో–ఆప్షన్ సభ్యుడు దూదేకుల హుస్సేన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు స్వర్ణాల వెంకటరావు, ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, డీటీ వేముల వెంకట నాగరాజు, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షుడు మల్లేశ్వరరావు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రఘుబాబు, తహసీల్దార్లు అంకారావు, పుల్లారావు, కిరణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

- పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి గ్రామోత్సవం



పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో భక్తవరదుని అలంకారంలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదు లాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, గడియార స్తంభం సెంటర్‌లోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తవరదుని అలంకారంలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, కనకతప్పెట్లు, 108 మందితో కోలాట ప్రదర్శనతో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యనిర్వహణాధికారి రంగిశెట్టి సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు.